క్లుప్తంగా

చేనేత రంగాన్ని ప్రోత్సహిద్దాం..



చేనేత వస్త్రాలను కొనుగోలు చేసిన రోటరీ సభ్యులు

బొబ్బిలి: చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ఆ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రోటరీ జిల్లా చైర్మన్ జె.సి.రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్‌లో రోటరీ కార్యవర్గమంతా వెళ్లి సుమారు రూ. 60వేల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసి విక్రేతలను ప్రోత్సహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్, సభ్యులు గెంబలి శ్రీనివాసరావు, నితీష్, రామకృష్ణ, మెర్సీబాయి, అనూరాధ, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి దివ్యప్రశాంతి

బాడంగి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరానికి చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన 68 మందికి ఆప్తాలమిక్ అధికారి దివ్యప్రశాంతి నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 41మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశామని క్యాంప్ జూనియర్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ తెలిపారు. మిగిలిన వారికి మందులు అందజేశామని చెప్పారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారిని విశాఖపట్నంలోని తమ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని, రవాణా, వసతి ఖర్చులు తామే భరిస్తామని స్పష్టం చేశారు. వాడాడ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జోగినాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాల యంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం ఏవిధంగా చేయాలో విద్యార్థులకు లైబ్రేరియన్ అవగాహన కల్పించారు. కథలు, ఇతిహాసాలు,శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవాలని సూచించారు. పుస్తక పఠనంతో ఏకాగ్రత పెరుగుతుందని, ఎన్నో కొత్త అంశాలు తెలుసుకోవచ్చని చెప్పారు.గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులను కోరారు.

ముందుకురాని.. మారాజులు..!

- పీ–4 కార్యక్రమం ఆచరణ సాధ్యమయ్యేనా..?
- పేదలను దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపని ధనిక, ఉద్యోగ, వ్యాపార వర్గాలు
- బంగారు కుటుంబాలు, దాతల వివరాలన్నీ అంకెలగారడీలే..
- లక్ష్యం చేరుకోలేక తలలు పట్టుకుంటున్న అధికారులు

రాజాం నియోజకవర్గంలో పీ–4 వివరాలు		
మండలం	బంగారు కుటుంబాలు	జనాభా
రాజాం పట్టణం	1,416	3,944
రాజాం	1,041	2,587
సంతకవిటి	2,408	6,550
వంగర	1,916	5,082
రేగిడి	2,030	5,421
మొత్తం	8,811	23,584

రాజాం: సమాజంలో ఆర్థికంగా బాగున్నవారు పేదలకు సాయమందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే దీనిపై ధనిక వర్గాల వారు పెద్దగా ఆసక్తి చూపడంలేదు.ఎలాగైనా సూచించిన ధనిక వర్గాలను ఒప్పించాలని జిల్లా అధికారులు కింది స్థాయి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో అధికారులకు పీ–4 పెద్ద తలనొప్పిగా మారిందని తెలుస్తోంది. పీ–4పై సమావేశం ఉందంటే చాలు ఇదేం బాధరా స్వామీ అంటూ అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది.

పీ-4 అంటే..

పీ–4 అంటే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ అనిఅర్థం. ఇందులో నలుగురుంటారు కాబట్టే దీన్ని ఫోర్‌పిల్లర్స్‌గా భావిస్తూ ఈ కార్యక్రమాన్ని పీ–4 గా పిలుస్తు న్నారు. ప్రతి ఇంటా అభివృద్ధి, ప్రతీ జీవితానికి ప్రగతి అనే నినాదంతో ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సమాజంలో అర్థికంగా బాగున్నవారు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఎన్‌ఆర్‌ఐలు కొన్ని బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికసాయం చేయవచ్చు. మెంటార్స్‌గా వ్యవహరించి వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అందేలా చేసి అభివృద్ధి చెందేలా చూడాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం ఈ ఏడాది నుంచి 2029 వరకు కొనసాగుతోంది. తక్కువలో తక్కువ కనీసం నాలుగు కుటుంబాలనైన ధనిక వర్గాలు దత్తత తీసుకోవాలి.

పొంతన లేని లెక్కలు

రాజాం నియోజకవర్గంలో ఇప్పటివరకు బంగారు కుటుంబాలకు సాయం చేస్తామని 945 మంది దాతలు ముందుకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వారిలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వీరు 2,927 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రభుత్వ వెబ్‌సైట్లో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన కుటుంబాలకు త్వరలో దాతలను ఏర్పాటుచేస్తామని అధికారులు అంటున్నారు. ఒక దాత ఒక కుటుంబాన్ని దత్తత తీసుకునేందుకే ఆసక్తి చూపని తరుణంలో ఇక్కడ 945 మంది దాతలు ఇంతమంది కుటుంబాలను ఎలా దత్తత తీసుకున్నారనేది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది. వెబ్‌సైట్‌లోని లెక్కలకు వాస్తవాలకు పొంతన కుదరడం లేదు.



రాజాం మండలం కంచరాంలో పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వ్యతిరేక నినాదం

సంపద సృష్టిస్తాం..మీ బతుకులు మారుస్తాం..ఉద్యోగాలు ఇస్తాం అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు ఇప్పుడు పేదలకు సంక్షేమ పథకాలు అందించలేక పీ–4 అంశాన్ని తెరపైకి తేవడాన్ని చాలామంది తప్పుపడుతున్నారు. ఏవేవో కలలుగన్న ప్రభుత్వ ఉద్యోగులకు పీ–4 తలబొప్పిగా మారింది. కూటమి పెట్టిన ఈ బంగారు కుటుంబాలకోసం మా బంగారాన్ని అమ్ముకోవాలా, ఈ పథకంలోకి తాము రామని ఉద్యోగ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి.

ఈ తరుణంలో సంబంధిత అధికారులు తమకు విధించిన లక్ష్యాలను చేరుకునేందుకు నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మీరు బంగారు కుటుంబాలకు డబ్బులు సాయం చేయకపోయినా పర్వాలేదని, వారికి మెంటార్స్‌గా ఉంటే చాలని నచ్చజెబుతూ దాతల పేర్లు నమోదు చేస్తున్నారనే వాదన వినిపస్తోంది.

వారెందుకు ముందుకు రావడం లేదు..?

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు మనసున్న మారాజులుగా ఎందుకు ముందుకు రావడంలేదనే మాట అటు జనం నుంచి ఇటు కొన్ని ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తోంది. ప్రధానంగా కూటమి కాంట్రాక్టర్లు, మద్యం షాపుల నిర్వాహకులు, ఇసుకరీచ్‌ల వ్యాపారులు వీరంతా తలో వంద బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని మారాజులుగా మారితే బాగుంటుందని బాహాటంగానే విమర్శిస్తున్నారు. బంగారు కుటుంబాలను కూటమి నేతలు, కార్యకర్తలు దత్తత తీసుకోవచ్చు కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి వారిని విడిచిపెట్టి చిరుద్యోగులను పీ–4లో భాగస్వాములను చేయడం, టార్గెట్‌లు ఇవ్వడం సబబేనా అని పలువురు ఉద్యోగులే ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గంలో 23,584 మంది గుర్తింపు

రాజాం నియోజకవర్గంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో మొత్తం 8811 బీపీఎల్ కుటుంబాలు ,ఇందులో మొత్తం 23,584 మంది జనాభా ఉన్నట్లు తేల్చారు. ఈ కుటుంబాల్లో ఇప్పటిదాకా బ్యాంకు ఖాతాలు లేనివారు, గ్యాస్, కరెంటు సౌకర్యాలు లేనివారు, తాగునీటి సదుపాయానికి నోచుకోనివారిని ఆయా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు గుర్తించారు. వీరిలో ఇప్పటివరకు 5,884 కుటుంబాలకు దాతలను సూచించగా, వీరిలో 2927 కుటుంబాలకు 945 మంది దాతలు సాయం అందించేందుకు అంగీకారం చెప్పినట్లు అధికారులు ధ్రువీకరించారు.

లక్ష్యం చేరుకుంటాం..



పేద కుటుంబాలను దత్తత చేసుకుని, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ–4 కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. ఈమేరకు బంగారు కుటుంబాలను ఎంపికచేశాం. దాతలను ముందుకురమ్మంటున్నాం. పలుచోట్ల ఉద్యోగులు, వ్యాపారులు ముందుకు వస్తున్నారు. ఎలాగైనా సరే లక్ష్యాన్ని చేరుకుని, పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చుతాం.

– వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం

మట్టిగణపతినే పూజిద్దాం..



అలజంగిలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వనమిత్ర కృష్ణదాస్

బొబ్బిలిరూరల్: రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణానికి హాని చేయని మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని గ్రీన్‌బెల్ట్‌సొసైటీ ప్రతినిధి వనమిత్ర కృష్ణదాసు ప్రజలకు సూచించారు.మండలంలోని అలజంగి గ్రామస్తులకు మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్‌ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో చేసిన విగ్రహాలను పూజలకు వినియోగించి అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితమవుతోందన్నారు. మండపాలు, ఇళ్లలో పర్యావరణ హితమైన మట్టిప్రతిమలనే ప్రతిష్ఠించాలని కోరారు. ఎంతమందికైనా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని,కావాల్సిన వారు తమని సంప్రదించాలని సూచించారు.

అన్నదాతల్లో ఆందోళన



ముగడ గ్రామంలో నీటి తడులు అందక వాడి పోతున్న వరినారు

బాడంగి: మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను ఆందోళన పెడుతున్నాయి. మండలంలో ఖరీఫ్ వరిసాధారణ సాగు విస్తీర్ణం 10వేల ఎకరాలు కాగా వ్యవసాయ బోర్లు, పాల్తేరు ఛానల్ కింద ఉన్న ఆయకట్టులో ప్రస్తుతానికి 2,500 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లుపడ్డాయి. వర్షధార భూములు, సాగునీటి చెరువుల కింద భూములున్న రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వేసవిని తలపించేలా ఎండల తీవ్రత ఉండడంతో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. నారుమడులను కాపాడుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీలోగా వర్షాలు కురవకపోతే దమ్ములు పూర్తవ్వడం కష్టమేనని, ఏం చేయాలో అర్థం కావడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వంగర: రుషింగి గ్రామంలోని షిర్డీ సాయి ఆలయంలో అర్చకులు శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రుషింగి, కిమ్మి, కొప్పరవలస, తలగాం తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి షిర్డీ సాయి బాబాకు పూజలు, అభిషేకాలు చేశారు.

ఎస్‌టీఓకు సత్కారం



పద్మనాభం దంపతులను సత్కరిస్తున్న జె.సి.రాజు, తదితరులు

బొబ్బిలి: గోసంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న ఎస్‌టీఓ పి.వి.పద్మనాభంను స్థానిక సెయింట్ ఆండ్రూస్ లూథరన్ చర్చిలో ఆదివారం ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు మాట్లా డుతూ ఎస్‌టీఓ పద్మనాభం గోకులాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే వినాయక చవితి ఉత్సవాలకు ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పద్మనాభం పాటుపడుతున్నార న్నారు. పాస్టర్ రెవరెండ్ జాన్ విక్టర్, పి.వి.ఏ.మెర్సీబాయి, వజ్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్

వంగర: మండలంలోని రాజులగుమ్మడ, జె.కె.గుమ్మడ గ్రామాల్లో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహిం చారు.గ్రామాల్లోని ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అంతా స్నేహ పూర్వకం గా మెలగాలని, అనవసరమైన, చిన్నచిన్న విషయాలకు గొడవలు పడొద్దని సూచించారు. సంఘ వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. వంగర, రేగిడి, సంతకవిటి ఎస్ఐలు షేక్ శంకర్, నీలావతి పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



రాజాం: యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నేతలు



బొబ్బిలి: యూటీఎఫ్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఆ సంఘ సభ్యులు

రాజాం: పట్టణంలోని తెలగవీధిలో రాజాం డివిజన్ స్థాయి ఏపీ యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) 52వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మారెల్ల కృష్ణమూర్తి యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పోరాట సంఘంగా వెలుగొందుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ,కార్మిక,కర్షక శ్రామిక వర్గాల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందం జలో ఉందని అన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు అదపాక వెంకటప్పలనాయుడు, జిల్లా కౌన్సిలర్ కుదమ తిరుమలరావు, డివిజన్ స్థాయి నాయకులు బోనెల గౌరీశ్వరరావు, రాజాం మండలశాఖ అధ్యక్షుడు మువ్వల రమేష్, ప్రధాన కార్యదర్శి బెవర జగదీశ్వరరావు, సంతకవిటి మండలశాఖ కార్యదర్శి దోల కృష్ణారావు, జిల్లా కౌన్సిలర్ శాసపు బాబూరావు నాయుడు, వంగర మండలశాఖ ప్రతినిధి చిట్టూరి నారాయణరావు, మూడడ్ల శ్రీనివాసరావు, రెడ్డి ఉమామహేశ్వరరావు, మొయ్యి శ్రీరాములు, కొమరపురి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో విద్యారంగం కుదేలు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల విద్యారంగం కుదేలవుతోందని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్ ఆరోపించారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక వల్లభ బాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా యూటీఎఫ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడి అంతిమ లక్ష్యం విద్యార్థులను తీర్చిదిద్దడమే తప్ప ఇలా సమాచార సేకరణకో, పరిపాలన సౌలభ్యానికో కాదన్నారు.. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎన్.అజయ్ కుమార్, కేశవరావు, శంకరరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శశిభూషణరావు, వెంకటరావు, చంటి, రమేష్, సుధాకరరావు, జగన్, అనంత్, శివప్రసాదరావు, పోలినాయుడు, అనంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..



రాజాం: రాజాం-విజయనగరం రోడ్డులో ఏర్పడిన గుంతలు



రాజాం: గుంత వద్ద తాటికమ్మ, రాళ్లు పెట్టిన దృశ్యం

రాజాం: రాజాం–విజయనగరం ప్రధాన రహదారి గాయత్రీకాలనీ సమీపంలో ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ రోడ్డుమధ్యలో రంధ్రం ఏర్పడగా ఇంతవరకు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదు. తాజాగా రోడ్డుకు మరో వైపు పెద్ద కుంట ఏర్పడింది. ఇక్కడ వాహనచోదకులు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదం జరగక తప్పదు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డుపై గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కర్ర,టైరే తాత్కాలిక రక్షణ



బొబ్బిలిలోని మేదర బంద జంక్షన్‌లో..

బొబ్బిలి: పట్టణంలోని మార్కెట్ ప్రాంతానికి దగ్గరలో ఉన్న మేదర బంద జంక్షన్‌లో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదక రంగా పరిణమించింది. పలువురు వాహన చోదకులు గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడడంతో స్థానికులు ఓ కర్ర, దానిచుట్టూ ఓ టైరు రాళ్లు ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వారిని స్థానికులు అప్రమత్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కార్యరూపం దాల్చేనా..?

- చిలకపాలెం- రాయగడ రోడ్డు ఆధునికీకరణకు చర్యలు
- సర్వే చేస్తున్న ఇంజినీర్లు
- రోడ్డు ఎడ్జి నుంచి తూర్పు వైపు 45 అడుగులు
- పడమర వైపు 30 అడుగులు విస్తరించేందుకు చర్యలు
- రామభద్రపురంలో విస్తరణా.. లేక బైపాస్ ఏర్పాటా..?



రామభద్రపురం గాంధీ బొమ్మ సెంటర్లో సర్వే చేస్తున్న సర్వే ఇంజినీర్లు అమర్,పవన్

రామభద్రపురం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఆధునీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి.అందులోభాగంగా శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయగడ వరకు 134.40 కి.మీ రాష్ట్ర రహదారిని పీపీపీ విధానంలో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించేందుకు డీపీఆర్ తయారు చేసేందుకు సర్వే ప్రారంభించారు. రామభద్రపురం మండలకేంద్రం మీదుగా బొబ్బిలి వెళుతున్న రోడ్డుకు ఎడ్జి నుంచి తూర్పు వైపు 45 అడుగులు,పడమర వైపు 30 అడుగులు ఆక్రమణలు తొలగించి విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

దశాబ్దాలుగా ప్రతిపాదనలు..

రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉన్న ఈ రహదారిని ఆధునీకరణ లో భాగంగా విస్తారిస్తారనన్న మాట దశాబ్దాలుగా వినిపిస్తూనే ఉంది. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులు ప్రతిపాదన లు సమర్పించారు.అందులో భాగంగానే ఈ మార్గంలో ప్రయాణించే వాహనాల సంఖ్య..తదితర వివరాలు సేకరించారు. రోడ్డు విస్తరిచేందుకు అన్ని అనుకూలతలు ఉన్నాయని తేల్చారు.ఆ దిశగా ప్రభుత్వానికి అధికారులు నివేదించినట్లు సమాచారం ఉంది.అది కూడా కార్యరూపందాల్చలేదు. రోడ్డు విస్తరణ అంశం కార్యరూపందాల్చితే పలు రాష్ట్రాల మధ్య రాకపోకలు మెరుగు పడడంతో పాటు ఆర్థిక,సామాజిక,వాణిజ్య రంగాల్లో అభివృద్ధికి మరింత దోహదపడుతుంది.

బైపాస్ ఇచ్చేందుకు ఆలోచన..?

రామభద్రపురం మండల కేంద్రంలోని రహదారి పక్కన దుకాణాలు పెట్టుకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మండలకేంద్రం మీదుగా రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తే రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న వందలాది కుటుంబాల వారు నిరాశ్రయులవుతారని అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం. ఈ సమస్యను అధిగమించేందుకు మండలంలోని మర్రివలస పక్కనుంచి బైపాస్ ఇచ్చి మండలకేంద్రాన్ని రోడ్డు విస్తరణ నుంచి తప్పిద్దామన్న ఆలోచనతో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ఆధునికీకరిస్తే మంచిదే..



రోడ్డు విస్తరించడం చాలా చాలా మంచిది. తాము సహకరిస్తాం.రోడ్డు పక్కన బతుకుతున్న వందలాది మంది చిరు వ్యాపారులను నిరాశ్రయులను చేసి వారికి జీవనాధారం లేకుండా చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అభివృద్ధి చేస్తే మంచిది.

– చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, రామభద్రపురం

పీపీపీ విధానంలో ఆధునికీకరణ



పీపీపీ విధానంలో చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయగడ వరకు రోడ్డును ఆధునికీకరించేందుకు కసరత్తు జరుగు తోంది. టెండర్లు పూర్తయినట్లు ఉన్నతాధికారులు చెప్పారు.ప్రస్తుతం డీపీఆర్ తయారవుతోంది. నాలుగు వరుసల రోడ్డా లేక రెండు వరుసల రోడ్డు వేయాలా, లేక బైపాస్ రోడ్డు ఇస్తారా అన్న వివరాలు డీపీఆర్‌లో పేర్కొంటారు.

– ప్రణయ, ఆర్అండ్‌బి జేఈఈ, బొబ్బిలి

డీపీఆర్ తయారీకి సర్వే..

శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి రామభద్రపురం మీదుగా రాయఘడ వరకు రోడ్డు ఆధునీకరించేందుకు డీపీఆర్ తయారు కోసం సర్వే చేస్తున్నాం.బైపాస్ వేయాలా, లేక ఈ రోడ్డు విస్తరించాలా అన్నది సర్వే రిపోర్ట్ ఇచ్చాక డీపీఆర్‌లో పొందుపరుస్తారు.రోడ్డుకు ఎడ్జి నుంచి తూర్పు వైపు 45 అడుగులు,పడమర వైపు 30 అడుగులు ఆక్రమణలు తొలగించాల్సి వస్తుంది. ఈ విధంగానే సర్వేచేసి నివేదికలు అందజేస్తాం.

– అమర్, పవన్, సర్వే ఇంజినీర్లు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



ఆటోడ్రైవర్‌ను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్

బొబ్బిలిరూరల్: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, అటువంటి వారికి న్యాయస్థానాలు భారీ జరిమానాతో పాటు శిక్షలు వేస్తాయని ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పిరిడి జంక్షన్ వద్ద ఆదివారం పోలీస్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు.అలాగే వాహనాల పత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించారు. వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించాలని, అతివేగం పనికి రాదని అవగాహన కల్పించారు. ఏఎస్ఐ ఎస్.ఏ.స్వామి పాల్గొన్నారు.